## ‘దివాని’ స్టోర్ ప్రారంభం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** భారతీయ సాంప్రదాయ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ‘దివాని’ తన మొట్టమొదటి స్టోర్‌ను బంజారాహిల్స్‌లో ప్రారంభించడం జరిగింది. నవాబుల వారసత్వం నుంచి ప్రేరణ పొందిన ప్రత్యేక వస్త్ర శ్రేణితో కూడిన వస్త్రాలను అందుబాటులో ఉంచారు. స్టోర్‌ను నటి నమ్రతా శిరోద్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నటి, నిర్మాత శ్రీదేవి చౌదరి, కంటెంట్ క్రియేటర్, ఇన్ఫ్యూఎన్సర్ దివ్య బొప్పన, ఫిలాంత్రపిస్ట్, కళా పోషకులు సుధారెడ్డి, దివాని వ్యవస్థాపకురాలు, క్రియేటివ్ డైరెక్టర్ సాన్యా ధీర్ తదితరులు పాల్గొన్నారు.

## 104 సర్వీస్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు మంజూరు



**ప్రజాపక్షం/అబిడ్స్:** 104 సర్వీస్ ఉద్యోగులకు రూ.20.05 కోట్ల పెండింగ్ వేతనాలు విడుదల చేసిన సందర్భంగా టిజిపిజిఎ సెంట్రల్ కమిటీ తరపున వైద్య శాఖ మంత్రి దామోదర్ నరసింహకు శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా టిజిపిజిఎ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ... 104 సర్వీస్‌లో పనిచేసిన ఉద్యోగుల పెండింగ్ వేతనాల కోసం తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పలు దఫాలుగా ముఖ్యమంత్రి, ఫైనాన్స్ మినిస్టర్, హెల్త్ మినిస్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశామని.. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.20. 05 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆనందం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులకు పీజీపీఓఏ తరపున ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో లీగల్ అడ్వైజర్ ఎన్.శ్యాం సుందర్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కండకట్ల శరత్‌బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, స్టేట్ కోశాధికారి యాదయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎఐటిఎ టోర్నీ




**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** విజయ్ టెన్నిస్ అకాడమీ వేదికగా జరిగిన నీలపు సింహాచలం మెమోరియల్ ఏఐటీఏ ఛాంపియన్‌షిప్ సిరీస్ జూనియర్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న వర్ధమాన క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ఫైనల్స్ పోరులో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.బాలికల విభాగంలో విజేత, పర్విత, అనీక్ష, అథర్వ, యశవర్ధన్, సహస్రద్, అక్షజ్ పద్మ ట్రోఫీలను అందుకున్నారు. దివంగత నీలపు సింహాచలం జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీ, గ్రాస్ రూట్ స్థాయిలో టెన్నిస్ క్రీడను ప్రోత్సహించేందుకు ఒక చక్కని వేదికగా నిలిచింది. వృత్తిపరమైన సౌకర్యాలతో నిర్వహించిన ఈ పోటీల్లో చిన్నారులు అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు.

## ఆశా వర్కర్లు అరెస్ట్

**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళన అరెస్ట్‌లకు దారి తీసింది. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన రూ.18 వేల కనీస వేతనం కోసం ఆశా వర్కర్లు రోడ్డెక్కడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆశా వర్కర్లు ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సచివాలయం, అసెంబ్లీ ప్రాంతాలకు రాకుండా వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలో ఓ ఆశావర్కర్ కిందపడిపోయి స్పృహకోల్పోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆశావర్కర్లు మాట్లాడుతూ.. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని.. కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన రూ.18 వేల జీతమే అడుగుతున్నామని తెలిపారు. ప్రతి చిన్నపనికి మేమే కావాలి.. అలాంటప్పుడు మమ్మల్ని ఎందుకు గుర్తించడం లేదని వాపోయారు. మాకు వచ్చే నెల జీతంతో కనీసం సరుకులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా కోసం మేము పర్మిషన్ తీసుకున్నా కూడా మమ్మల్ని అడ్డుకుని అరెస్ట్ చేస్తున్నారని ఆశావర్కర్లు తీవ్రంగా మండిపడ్డారు.

## గద్దర్‌పై కాల్పుల యాదిలో ఏప్రిల్ 6న సదస్సు



**ప్రజాపక్షం / సోమాజిగూడ :** ప్రజాయుద్ధనౌక దివంగత గద్దర్‌పై కాల్పుల ఘటన జరిగి 29 ఏళ్లు అవుతున్నదని, ఈ నేపథ్యంలో ఏప్రిల్ 6న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో “ ప్రశ్నించే గొంతులు – సాధించిన విజయాలు’ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు గద్దర్ ఫౌండేషన్ కన్వీనర్ జివి సూర్యకిరణ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను టిజెఎస్ అధినేత, ప్రొఫెసర్ కోదండరామ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలంగాణ సమాఖ్య అధ్యక్షులు దేశాయి కరుణాకర్, ఒయు జెఎసి అధ్యక్షులు మందాల భాస్కర్ ఆవిష్కరించి, మాట్లాడారు. గద్దర్‌పై జరిగిన కాల్పుల ఘటనను ధిక్కార స్వరంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. గద్దర్ పేరిట అవార్డులు కాదని, ఆయనపై కాల్పులు జరిపిన వారెవరో వెలుగులోకి తేవాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళులర్పించినట్టు అవుతుందని పేర్కొన్నారు.

# అరగంటలో సొత్తు రికవరీ




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రూ.లక్షల విలువైన సొత్తు పోగొట్టుకున్న అరగంటలోనే పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ ఘటన సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. తమిళనాడుకు చెందిన మణిమేగల ఈ నెల 27న రాత్రి 9:30 గంటల సమయంలో లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ బస్టాప్ వద్ద పొరపాటున తన హ్యాండ్‌బ్యాగ్‌ను రాపిడో ఆటోలో వదిలేశారు. ఆ బ్యాగులో 25 గ్రాముల బంగారు గాజులు, 2 గ్రాముల బంగారు కమ్మలు, రూ.30 వేల నగదు (మొత్తం విలువ సుమారు రూ.4 లక్షలు), ముఖ్యమైన పత్రాలు ఉన్నాయి. వెంటనే బాధితురాలు సైఫాబాద్ పోలీసులను ఆశ్రయించగా.. సిఐ సీతయ్య వెంటనే స్పందించి, క్రైమ్ టీమ్ సభ్యులు పిసి ప్రసాద్ రాజు, పిసి సురేష్ గౌడ్లను రంగంలోకి దించారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రాపిడో వివరాలు సేకరించిగా పోలీసులు ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్ చాదర్‌ఘాట్ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన క్రైమ్ టీమ్ వెంటనే అక్కడికి చేరుకుని హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుంది. డ్రైవర్‌తో పాటు రికవరీ సొత్తును సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగదు, బంగారు ఆభరణాలు అన్నీ భద్రంగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాక సిఐ సీతయ్య వాటిని బాధితురాలికి అందజేశారు. కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసిన సైఫాబాద్ పోలీసుల పనితీరు, సత్వర స్పందనను బాధితురాలు కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## బేకరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై దాడి




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్(గోల్కొండ టీమ్), గుడిమల్కాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో... కేడీ కాలనీ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్న అక్రమ బేకరీ తయారీ కేంద్రం గుట్టురట్టు చేశారు. ఈ దాడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, భారీ మొత్తంలో నిల్వ ఉంచిన బేకరీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నా రు. అదే విధంగా మైలార్‌దేవుపల్లి పరిధిలో కల్తీ మిక్చర్, బిస్కట్లు, చిక్కీలు తయారు చేస్తున్న ముఠా వ్యవహారాన్ని రట్టు చేశారు. బాబుల్‌రెడ్డినగర్, లక్ష్మిగూడ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహార పదార్థాలను తాయారు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. రాజేంద్రనగర్ జోన పోలీసులు, హెచ్‌ఎఫ్‌ఏఎస్‌టీ బృందం సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

# పోలీస్ ఫుట్‌బాల్‌లో రాజస్థాన్ గెలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగర వేదికగా జరుగుతున్న 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు పై రాజస్థాన్ జట్టు తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఆర్టిలరీ గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్‌ఎఫ్ మ్యాచ్‌లో రాజస్థాన్ 30 తేడాతో తెలంగాణపై విజయం సాధించింది. ఆరంభం నుంచే వ్యూహాత్మక దాడులతో విరుచుకుపడిన రాజస్థాన్ ఆటగాళ్లు, తెలంగాణ రక్షణ శ్రేణిని ఛేదిస్తూ వరుసగా మూడు గోల్స్ చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. మరోవైపు శ్రీనిధి ఎఫ్.సి మైదానంలో జరిగిన గ్రూప్‌బి పోరులో బి.ఎస్.ఎఫ్ జట్టు 30 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌ను ఓడించింది. గ్రూప్‌డి లో జరిగిన రసవత్తర పోరులో పంజాబ్ 21తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో తమిళనాడుపై కేరళ (20), ఉత్తరాఖండ్‌పై మిజోరాం (30) జట్లు సునాయాస విజయాలను నమోదు చేశాయి. ఇక మహిళల విభాగంలో ఎస్ ఎస్ బి జట్టు మైదానంలో గోల్స్ సునామీ సృష్టించింది. హైదరాబాద్ ఎఫ్.సి గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్‌ఏ మ్యాచ్‌లో ఎస్ఎస్‌బీ ఏకంగా 160 తేడాతో జార్ఖండ జట్టును మట్టికరిపించి టోర్నీలోనే భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇదే గ్రూపులో జరిగిన మరో మ్యాచ్‌లో సి.ఐ.ఎస్.ఎఫ్ జట్టు 10తో సి.ఆర్.పి.ఎఫ్ పై విజయం సాధించింది. అదేవిధంగా, అస్సాం రైఫిల్స్ 50 స్కోర్ తో చండీగఢ్ పై, ఐటిబిపి ఆర్పిఎఫ్ పై 20 స్కోర్ తోను, జమ్ము కాశ్మీర్ కర్ణాటక పై 20 స్కోర్ తోను, త్రిపుర మధ్యప్రదేశ్ పై 31 స్కోర్ తోను విజయం సాధించాయి.

## శ్రీపాదకు వివేకానంద స్ఫూర్తి రత్న అవార్డు ప్రదానం



**హైదరాబాద్ :** ఎపిలోని రాజమహేంద్రవరంకు చెందిన రచయిత, తెలంగాణ సిఎల్‌పి ఉద్యోగి శ్రీపాద శ్రీనివాస్‌కు వైద్యుల గ్లోబల్ ట్రస్ట్, వసుంధర విజ్ఞాన వికాస మండలి వివేకానంద స్ఫూర్తి రత్న జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రముఖుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. వృత్తితో పాటు ప్రవృత్తిగా కవితలు, కథానికలతో అనతి కాలంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీనివాస్‌ను వక్తలు అభినందించి సత్కరించారు. రచనా పర్వాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళ్లిన మిత్ర బృందం, మునిసిపల్ టౌన్ హైస్కూల్ 1987 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సత్కరించారు. అలాగే హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం అధికారులు వి.గోపీ చందు, ఏ. అవదాని, కార్యవర్ది, సందీప్ కూడా సత్కరించారు.

## నీటి ఎద్దడి లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే శ్రీగణేష్



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కంటోన్మెంట్ బోర్డు అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో మంచినీటి సరఫరా మెరుగు కోసం నూతన పవర్ బోర్‌వెల్‌లను వేయాలని, పాత బోర్‌వెల్‌లను రిపేరు చేసి.. పాడైపోయిన మోటార్ల స్థానంలో కొత్త మోటార్లను బిగించి ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు స్థలాలను చూపిస్తే రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉందని.. కంటోన్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసే హోర్డింగుల విషయంలో చిరు వ్యాపారులకు తక్కువ రేట్లు ఉండేలా చూడాలన్నారు. అధిక రేట్లతో వారిని ఇబ్బంది పెట్టవద్దని, రామన్నకుంట చెరువు అభివృద్ధికి త్వరగా ఎన్వోసి ఇవ్వాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి మెరుగైన పరిహారం అందించాలని, ఎన్ని అడుగుల మేర విస్తరిస్తున్నారో భూ నిర్వాసితులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు సిఇఓ అరవింద్ కుమార్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఆరోగ్యవంతులు అయ్యేందుకు సరైన మార్గదర్శకత్వం : డాక్టర్ సందకోవర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలు ఆరోగ్యంగా మారేందుకు సరైన మార్గదర్శకత్వం అవసరమని డాక్టర్ సందకోవర్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇండియా బిజినెస్ హెల్త్ లాస్ చాలెంజ్ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ సందకోవర్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగిస్తూ ప్రజలలో ఊబకాయం (అధిక బరువు) గురించి ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ ఆడ్రియన్ కెన్నెడీ, డాక్టర్ సందకోవర్ కలిసి నిర్వహించిన సర్వేలో వచ్చిన నివేదికలు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని చెప్పారు. కిమ్స్ హాస్పిటల్స్‌లో ఊబకాయం, బరువు సమస్యలకు క్లినికల్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ సందకోవర్ అధిక బరువు టైప్ 2 డయాబెటిస్ వంటి తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, పరిశోధకులు, సామాజిక నాయకులు పాల్గొని ఆరోగ్య మార్పు కోసం తమ మద్దతును ప్రకటించారు.

## 31న భగవాన్ మహావీరుడి జయంతోత్సవం

**ప్రజాపక్షం / సోమాజిగూడ :** జైనుల ఆరాధ్య దైవం భగవాన్ మహావీరుని 2625 జయంతోత్సవం ఈ నెల 31న హైదరాబాద్ ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు శ్రీజైన్ సేవా సంఘ్ మార్గదర్శక మండల్ చైర్మన్ యోగేశ్ కుమార్ సింగి తెలిపారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘ్ అధ్యక్షులు ఉమేశ్ బాజీరెచ్చ మాట్లాడుతూ మహావీర్ జయంతి అనేది జైనులకు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద పండుగ అని అన్నారు. 31న ఉదయం 8.30 గంటల నుంచి హైదరాబాద్‌లోని ఫిల్‌ఖానాలోని జైనమందిరం నుంచి ఒక భారీ శోభాయాత్ర మొజంజాహి మార్కెట్ మీదుగా సాగి ఉదయం 10.30గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకొంటుందన్నారు. ఆరోజు ఉచిత ఆరోగ్య శిబిరాలు, ఆక్యుప్రెషర్ శిబిరాలు, ఇతర వైద్య, సంక్షేమ కార్యక్రమాలుంటాయన్నారు. సమావేశంలో సీనియర్ ఉపాధ్యక్షులు వినోద్ ముఖాన, కార్యదర్శి విమల్ ముథ, కోశాధికారి సురేశ్ సూరన, సంయుక్త కార్యదర్శి యోగేశ్ సోని, ముఖ్య కన్వీనర్‌లు సునీల్ కావడియా, దిలీప్ భండారి, దిలీప్ షెటియ తదితరులు పాల్గొన్నారు.

# ఐటి సంస్కరణలపై అవగాహన అవసరం

### ఐటి శాఖ కమిషనర్ షానవాజ్ ఉల్ రెహమాన్



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఆదాయ పన్ను సంస్కరణలపై వృత్తి నిపుణులు అవగాహన కలిగి ఉండాలని ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ షానవాజ్ ఉల్ రెహమాన్ సూచించారు. మారుతున్న పన్ను సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎంఎఐ) హైదరాబాద్ చాప్టర్, శాతవాహన, వరంగల్ చాప్టర్లతో ఆదాయపు పన్ను శాఖ సహకారంతో లక్డీకాపూల్‌లోని హోటల్ అబోడ్లో ‘ఆదాయపు పన్ను చట్టం 2025’ పేరిట జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మారుతున్న పన్ను విధానాలను అర్థం చేసుకోవడం ఎంతో కీలకమన్నారు. నిరంతరం మారుతున్న సంస్కరణలకు అనుగుణంగా నిపుణులు తమ పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సదస్సులో డైరెక్ట్ టాక్సేషన్ కమిటీ చైర్మన్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సిఎంఎ రాజేంద్ర సింగ్ వర్చువల్‌గా మాట్లాడగా.. హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సిఎంఎ ఖాజా జలాల్ ఉద్దీన్, సిఎంఎ నాగేశ్వరరావు, సిఎంఎ మహేష్‌రెడ్డి, సిఎంఎ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కేసీహెచ్ఏవీవీ ఎస్ఎన్ మూర్తి, ఎస్ఐఆర్సీ ట్రెజరర్ సిఎంఎ కేవీఎన్ లావణ్య, సెక్రటరీ సిఎంఎ కీర్తి గుప్త, శాతవాహన చాప్టర్ చైర్మన్ సిఎంఎ ఫణితేజ పెండ్యాల, వైస్ చైర్మన్ సిఎంఎ అనిల్ కుమార్, వరంగల్ చాప్టర్ వైస్ చైర్మన్ సిఎంఎ బల్గురి శరత్ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బిసి రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో

# ప్రైవేట్ బిల్లు పెట్టాలి

### రాహుల్ గాంధీకి లేఖ రాసిన మాజీ ఎంపి వి.హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టాలని రాహుల్ గాంధీకి లేఖ రాసినట్లు మాజీ ఎంపి వి.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్ష నేతగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టాలని, ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, సిఎం రేవంత్ రెడ్డి, కెసి వేణుగోపాల్‌లకు లేఖలు రాశానని తెలిపారు. రాహుల్ గాంధీ బిసి ప్రైవేట్ మెంబర్ బిల్లు ఆమోదం పొందినా, పొందకపోయినా బిసిల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి బిల్లు పెట్టాలని కోరానన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ సవరిస్తేనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం అవుతుందని, బిసి అయినా మోదీ బిసిలకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. ఈ అంశంపై సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆధ్వర్యంలో జంతర్ మంతర్‌లో ధర్నా కూడా చేశామని, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో శ్రీరాముని కళ్యాణం జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతానని విహెచ్ తెలిపారు.

## పేద విద్యార్థులకు ‘ముత్తూట్’ అండ అభినందనీయం

### రిటైర్డ్ ఐపిఎస్ జెడి లక్ష్మీ నారాయణ



**ప్రజాపక్షం / సోమాజిగూడ:** గత ఎనిమిదేళ్లుగా ముత్తూట్ సంస్థ స్కాలర్‌షిప్‌లనుపేద విద్యార్థులకు అందజేయడం అభినందనీయమని రిటైర్డ్ ఐపిఎస్ జెడి లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం హైదరాబాద్ ముత్తూట్ సంస్థ కార్యాలయంలో 30 మంది పేద విద్యార్థులకు 50లక్షల స్కాలర్‌షిప్‌లను అందజేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును విద్య ద్వారానే తీర్చిదిద్దుకొనేలా ముత్తూట్ సంస్థ అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఎంబిబిఎస్, నరిసగ్, బిటెక్ విద్యార్థులకు గొల్డెమెడల్, స్కాలర్‌షిప్‌లను జెడి అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల జోనల్ హెడ్ బి. సంపత్, రిస్క్ రికవరీ హెడ్ ప్రసాద్, సిఎస్ ఆర్ మేనేజర్ లక్ష్మీ నారాయణమ్మ, హైదరాబాద్ రీజిలన్ మేనేజర్‌లు పి.అనూప్, బిందు, రవికిరణ్‌రెడ్డి, పి.శ్రీనివాస్, రికవరీ మేనేజర్ ఎస్.కె.లతీఫ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పిప్పిరిలో ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న 99 రోజుల 'ప్రజాపాలన' ఉత్సవాలలో భాగంగా,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో ఏప్రిల్ 6న నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు అధికారులు అన్నీ ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర ఉన్నత అధికారులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించి, అధికారులకు దిశ, నిర్దేశం చేశారు. ‘ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం తాను చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర పిప్పిరి గ్రామం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. అందుకే ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా, పాదయాత్ర సమయంలో కొన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలు పత్రాలను అందజేస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి బాసరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 2 గంటలకు పిప్పిరి గ్రామానికి చేరుకుని బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఆయన వివరించారు. ‘ రాష్ట్రంలో '99 రోజుల ప్రజాపాలన ఉత్సవాలు' ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే గ్రామసభల నిర్వహణతో పాటు, ముఖ్యమంత్రి గారి భారీ బహిరంగ సభను పిప్పిరిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ‘అని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ ద్వారా ప్రొహిబిషన్ (నిషేధిత) జాబితాలో చేర్చిందని, దీనివల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన గుర్తుచేశారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాటి సిఎల్‌పి నేతగా తాను కలిసి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను వేధిస్తున్న ధరణిని రద్దు చేసి, పారదర్శకమైన వ్యవస్థను తెస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ మాట ప్రకారమే అధికారంలోకి రాగానే 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములను 'పార్ట్‌బి'లో పెట్టి రైతులకు హక్కులు లేకుండా చేసిందని, కానీ తమ ప్రభుత్వం చట్టబద్ధంగా వారి హక్కులను కాపాడుతుందని స్పష్టం చేస్తూ, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

